క్లుప్తంగా

ఉత్తమ సేవలకు గుర్తింపు

పరిగి ఆర్టీసీ డీఎం కరుణశ్రీ



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఎం

పరిగి: ఉత్తమ విధులు నిర్వహించే ఉద్యోగులకు మంచి గుర్తింపు ఉంటుందని పరిగి ఆర్టీసీ డీఎం కరుణశ్రీ అన్నారు. గురువారం ప్రమాద అవగాహన దినోత్సవ సందర్భంగా పట్టణ కేంద్రంలో ఆర్టీసీ డిపోలో ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ సంపదను పెంచేందుకు ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. డ్రైవర్ ఎల్లప్పుడు కేఎంపీఎల్‌ను దృష్టిలో ఉంచుకుని డ్రైవింగ్ చేయాలన్నారు. కండక్టర్ మంచి ఆదాయం వచ్చేలా కృషి చేయాలన్నారు. విధుల పట్ల అంకిత భావంతో పని చేస్తున్నా వారికి ఆర్టీసీ ఎల్లప్పుడు ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి ఆర్టీసీ అభ్యున్నతికి సహకారించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి

జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు



క్రీడాదుస్తులు అందజేసిన పూర్వ విద్యార్థులు

కుల్కచర్ల : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను స్పోర్ట్స్, విద్యపరంగా ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు అన్నారు. గురువారం మండలంలోని ముజాహిద్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు కాకి గోపాల్, విజయలక్ష్మి పాఠశాల తరపున జిల్లాస్థాయిలో క్రీడలు ఆడుతున్న విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులను బహూకరించారు. సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ..జిల్లాస్థాయిలో విద్యార్థులు క్రీడలు ఆడుతున్న సమయంలో డ్రెస్‌కోడ్ లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. గమనించిన పూర్వ విద్యార్థులు స్పోర్ట్స్ డ్రెస్‌ను అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీటీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షకులు ఏఎస్ రెడ్డి



ఇంగ్లిష్ ప్రాక్టీస్ చేయిస్తున్న ఏఎస్ రెడ్డి

తాండూరు టౌన్ : విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలని ప్రసిద్ధ స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షకులు ఏఎస్ రెడ్డి అన్నారు. గురువారం విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంగ్లంపై పట్టు సాధిస్తే తాము ఎంచుకున్న ఏరంగంలోనైనా రాణించవచ్చన్నారు. ప్రపంచంలోని ఏ ప్రదేశానికైనా వెళ్లినా ఉద్యోగం చేయొచ్చన్నారు. ఆంగ్లంలో తరచూ మాట్లాడుతుండడం వల్ల నైపుణ్యం పెరిగే అవకాశం ఉందన్నారు. ఆంగ్లం అంటేనే గ్రామీణ ప్రాంత విద్యార్థులు భయాందోళనకు గురవుతుంటాని తెలిపారు. మూడేళ్ల పాటు విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తానన్నారు. అనంతరం విద్యార్థులను గ్రూపులుగా విభజించి మాట్లాడే విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్, ఆంగ్ల అధ్యాపకులు మమత, అరుణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

- కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బొలుసాని భీంరెడ్డి



ఆర్థిక సాయం అందజేస్తున్న భీంరెడ్డి

కుల్కచర్ల : పేద కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బొలుసాని భీంరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కొమ్ముపెద్ద బాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, రజక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేశ్, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్, వార్డు సభ్యులు ఎల్లప్ప, శ్రీను, జావీద్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్



అనంతగిరి: ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసాద్‌కుమార్
- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని హామీ
- ముమ్మరంగా ఇంటింటి ప్రచారం

బంట్వారం: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రజలను కోరారు. గురువారం ఆయన బంట్వారం, రొంపల్లి మంగ్రాస్‌పల్లి, సల్బత్తాపూర్, మద్వాపూర్, నాగవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను మించిన మోసకారి దేశంలో ఎక్కడా లేరన్నారు. గత హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదని ఆరోపించారు. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో కల్వకుంట్ల కుటుంబం ఎక్కడికక్కడ దోచుకుని తెలంగాణను అధోగతి చేసిందన్నారు. ధనిక రాష్ట్రంలో ఐదు లక్షల కోట్లు అప్పు మిగిల్చిన కేసీఆర్ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని మండిపడ్డారు. మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైన బీఆర్‌ఎస్‌ను బంగాళాఖాతంలో కలపాలన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకుందామన్నారు. నియోజకవర్గంలో తన హయాంలో జరిగిన అభివృద్ధి పనులు తప్పా స్థానిక ఎమ్మెల్యే కొత్తగా ఒరగ బెట్టిందేమీలేదన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తనను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్ ,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి , డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి ,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు స్వరూప ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటేశం , నాయకులు పురుషోత్తంరెడ్డి, మొగులయ్య ,అంజిరెడ్డి ,శ్రీనివాస్‌రెడ్డి ,రవీందర్‌రెడ్డి ,ఎస్.నర్సింలు , శ్రీనివాస్ ,సంగమేశ్వర్ ,రాధాకృష్ణగౌడ్ ,గిరిదాస్ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వి మోసపు హామీలు

ధారూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నిరుద్యోగులు మండిపడుతున్నారని ధారూరు మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో వారి మాటలను ప్రజలెవరూ విశ్వసించడం లేదన్నారు. మండలంలోని ధారూరు, హరిదాస్‌పల్లి గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగ భృతి, ఉపాధి కల్పన, ఉద్యోగాల నియామకాలు ఎక్కడ అమలైయ్యాయని ప్రశ్నించారు. రైతు బంధు అంటూ వ్యవసాయ సబ్సిడీలను ఎత్తేసారని ఆరోపించారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు ప్రతి ఒక్కరికి వచ్చాయని, ఈ ప్రభుత్వంలో ఏ ఒక్కరికైనా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు వచ్చాయని నిలదీశారు. పేద ప్రజల ఇళ్ల కోసం ప్రతి సంవత్సరం కేటాయిస్తున్న కోట్లాది రూపాయలు సీఎం కేసీఆర్ ఏం చేశారని దుయ్యబట్టారు. హస్తం గుర్తుకు ఓటు వేసి ప్రసాద్ కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ బాబాఖాన్, బుజ్జయ్యగౌడ్, కిరణ్‌కుమార్, రాజేశ్వర్, ముజాఫర్, లింగనపల్లి అశోక్, నెల్లి అశోక్, ఇనాయతుల్లాఖాన్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌కుమార్ గెలుపు ఖాయం

అనంతగిరి: ప్రసాద్‌కుమార్ గెలుపు ఖాయమని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం కాంగ్రెస్ అభ్యర్థి తరపున వికారాబాద్ ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుభాష్‌నగర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆరు గ్యారంటీ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయన్నారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడికి వెళ్లిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కాంగ్రెస్ 6 గ్యారెంటీలకు ప్రజలు ఎంతో ఆకర్షితులవుతున్నారన్నారు. గత 10 సంవత్సరాలుగా ఉద్యోగాలు రాక తీవ్ర నిరాశలో నిరుద్యోగులు ఉన్నారని అన్నారు. అనంతరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమానికి మారు పేరు కాంగ్రెస్ పార్టీయేనన్నారు. వికారాబాద్‌లో ఒక డబుల్ బెడ్ రూం కూడా ఇవ్వలేదని, స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి కాలంలో నిర్మించిన రాజీవ్‌గృహకల్ప, ఇందిరమ్మ ఇండ్లు కన్పిస్తున్నాయన్నారు. ప్రసాద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, రెడ్యా నాయక్, మధుకర్, లక్ష్మణ్, బాదం అశోక్, బన్సీలాల్, శేఖర్ పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే గ్యారంటీల అమలు

మర్పల్లి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి ఆరు సంక్షేమ పథకాలు కచ్చితంగా అమలు చేస్తామని ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బూచన్‌పల్లిలో ప్రచారంలో భాగంగా ఇంటింటిరి తిరుగుతూ గ్యారంటీ పథకాలపై అమలుపై కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపిస్తే ప్రతి కుటుంబం బాగుపడుతోందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేదలకు ఎలాంటి మేలు జరుగలేదని విమర్శించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రాంమ్‌రెడ్డి, గ్రామ కమిటీ యూత్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, నర్సింహ్మరెడ్డి, బిచ్చిరెడ్డి, బలవంత్‌రెడ్డి ఉన్నారు.

పైలెట్ ఇంట పెళ్లి సందడి



తాండూరు: తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఇంట గురువారం పెళ్లి అట్టహాసంగా జరిగింది. రోహిత్‌రెడ్డి బాబాయ్ బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీశైల్‌రెడ్డి కూతురు నవ్య వివాహం హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకలకు రోహిత్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులంతా హాజరై ముందుండి జరిపించారు.

తాండూరు రూపురేఖలు మారుస్తా

బీసీవై ఎమ్మెల్యే అభ్యర్థి రాంచందర్‌యాదవ్



ప్రచారం నిర్వహిస్తున్న రాంచందర్ యాదవ్

బంట్వారం: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే తాండూరు రూపురేఖలు మారుస్తానని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మపురం రాంచందర్ యాదవ్ ప్రజలను కోరారు. గురువారం ఆయన నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ బిడ్డనైన తనను ఆదరించి చెరకు రైతు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలంటూ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ,బీఆర్‌ఎస్ ,బీజేపీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. బీసీవై నాయకులు పాల్గొన్నారు.

సోనియాగాంధీ రుణం తీర్చుకునే అవకాశం



తాండూరు రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని సిరిగిరిపేట్ , ఐనెల్లి , మల్కాపూర్, సంగెంకలాన్, కోటబాసుపల్లి, వీరారెడ్డిపల్లి, సంకిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగాలకు చలించి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ప్రకటించిందన్నారు. కావునా పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆరు గ్యారంటీల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. సంగెంకలాన్ సర్పంచు మేఘనాథ్‌గౌడ్, మల్కాపూర్ మాజీ ఎంపీటీసీ రఘునాథ్‌రెడ్డిలు తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, నాయకులు ఉత్తమ్‌చందు, జనార్దన్‌రెడ్డి, రాజ్‌కుమార్, శ్రీను, రాందాస్, ˘వేణుగోపాల్, వెంకటప్ప, పురుషోత్తంరెడ్డిలు ఉన్నారు.



పెద్దేముల్: గడపగడపకూ తిరుగుతూ ప్రచారం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

యాలాల: మండలంలోని దేవనూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్ నేత డాక్టర్ సంపత్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు మాసుల ఖాసీం, వార్డు సభ్యుడు జావీద్ తదితరులతో పాటు సుమారు 50 మంది పార్టీ కండువా కప్పుకున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డికి భారీ మెజార్టీ అందిస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు హన్మంతు, మహిపాల్, ఖాసీం, శ్రీనివాస్ చారి తదితరులు ఉన్నారు.

మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రాబోతోంది..

పెద్దేముల్: మనోహర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరని పెద్దేముల్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మంబాపూర్, పెద్దేముల్, నాగులపల్లి, కందనెల్లితో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. తాండూరు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం , దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలనను రాబోతుందన్నారు. అనంతరం పెద్దేముల్ గ్రామంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభరాణి , కందనెల్లితో పాటు పలు గ్రామాల్లో మాజీ ఎంపీపీ వాణీశ్రీ గడపగడపకూ వెళ్లి మరోహర్‌రెడ్డికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మి, ఎల్లారెడ్డి, నర్సిములు, కృష్ణారెడ్డి, మైపూస్, కుమార్, రియాజ్, ముజీఫ్, విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

రోహిత్‌రెడ్డికి భారీ మెజార్టీ ఖాయం



ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీ తదితరులు

ఆకట్టుకున్న గోల్డ్‌మ్యాన్ లాలు ముదిరాజ్

యాలాల: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి యాలాల మండలం నుంచి భారీ మెజార్టీ లభించడం ఖాయమని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఉదయం మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, మండల వైస్ ఎంపీపీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబాతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి పంచాయతీకి రూ.50 లక్షల ప్రత్యేక నిధులను కేటాయించిన ఘనత రోహిత్‌రెడ్డికి దక్కిందన్నారు. మరోమారు బీఆర్‌ఎస్ సర్కారు ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని చెప్పారు. అలాగే, నగరంలోని ఖాలపేటకు చెందిన లాలు ముదిరాజ్(గోల్డ్ మ్యాన్) ఎన్నికల ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఒంటినిండా బంగారం ధరించి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రచారం చేయడం ఆకట్టుకుంది, కార్యక్రమంలో బీసీ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రాజ్‌కుమార్, మాజీ వైస్‌ఎంపీపీ అనంతయ్య, ముదిరాజ్ సంఘ ప్రతినిధులు బుర్నపురి నర్సింహులు, బాయిమీది అశోక్, పాండుగౌడ్, లాలప్ప ముదిరాజ్ తదితరులు ఉన్నారు.



ప్రచారంలో గోల్డ్‌మ్యాన్ లాలు ముదిరాజ్

కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు



నవాబుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

నవాబుపేట: నేను ప్రజల కోసం పని చేసే వ్యక్తిని మరోసారి ఆశీర్వదించండి.. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. గురువారం సాయంత్రం వట్టిమీనపల్లి, నవాబుపేట, దాతాపూర్ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తున్నానని, సేవకుడిగా పని చేసే భాగ్యం మరోసారి కల్పించాలని కోరాడు. గత రెండు పర్యాయాలు తాను ఎమ్మెల్యేగా ఉన్నా నిత్యం ప్రజల మధ్య స్వగ్రామంలోనే ఉంటున్నానని వివరించారు. ప్రభుత్వ ఫలాలు పేదలకు, రైతులకు చేరవేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, వైస్ ఎంపీపీ బందయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు రంగారెడ్డి, బల్వంత్‌రెడ్డి, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



ప్రచారంలో మాట్లాడుతున్న మహేశ్‌రెడ్డి

పూడూరు: గ్రామాల్లో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఆ పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని పూడూరు, చిన్న బండతండా, కండ్లపల్లి, చీలాపూర్, బాకాపూర్, కొత్తపల్లి, తిమ్మాపూర్, మీర్జాపూర్, ఎన్కేపల్లి, గొంగుపల్లి, మన్నేగూడ తదితర గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించామని మరోమారు ఓటు వేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

పరిగి: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని జెడ్పీటీసీ హరిప్రియ అన్నారు. గురువారం మండలంలోని మల్కయాపేట, హిర్యానాయక్ తండాల్లో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రతి వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని పథకాల ప్రవేశపెట్టారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందేల కృషి చేశారన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు కావాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలని పిలునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ మాయమాటలను నమ్మి మోసపోద్దని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

సొంత గూటికి సర్పంచ్

దోమ : మండల పరిధిలోని దోర్నాల్‌పల్లి సర్పంచ్ యాదయ్యసాగర్ సొంత గూటికి చేరారు. గురువారం ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సమక్షంలో ఆయన బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న ఆయన.. ఇటీవలే డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న విధి విధానాలు నచ్చకపోవడంతో తిరిగి మళ్లీ సొంత గూటికి చేరుకున్నానని వివరించారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న మారుతి కిరణ్

కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పరిగి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారుతి కిరణ్

దోమ : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పరిగి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బూనేటి మారుతి కిరణ్ సూచించారు. గురువారం మండలంలోని కొత్తపల్లిలో ఆంజనేయస్వామి, పోశమ్మ, ఎల్లమ్మ, విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధి మారుతి కిరణ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తిభావం అలర్చుకున్నప్పుడే సమాజంలో శాంతి, జ్ఞానసముపార్జన సాధ్యమవుతుందని చెప్పారు. ఆధ్యాత్మికతో మానసిక ప్రశాంతత కలుగుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి హరికృష్ణ, పరిగి, దోమ మండలాల ప్రధాన కార్యదర్శులు మల్లేశం, నర్సింహా గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకుంటాం



ప్రచార కార్యకమాన్ని ప్రారంభిస్తున్న అభ్యర్థి శంకర్ గౌడ్, సదానంద రెడ్డి తదితరులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి
- తాండూరు ప్రజల సమస్యలను తీరుస్తా : జనసేన అభ్యర్థి శంకర్ గౌడ్

తాండూరు టౌన్ : బీజేపీ, జనసేన తాండూరు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి నేమూరి శంకర్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరులో బీజేపీ ఎంతో బలంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు అవినీతిలో కూరుకుపోయి ఉన్నాయన్నారు. మోదీ ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. గ్రామగ్రామాన ప్రచారం చేసి, పవన్ కళ్యాణ్ అభిమానులతో కలిసి గాజు గ్లాసు గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరుతామన్నారు. అనంతరం జనసేన అభ్యర్థి శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇస్తున్న సంపూర్ణ మద్దతుతో ఘన విజయం సాధిస్తానన్నారు. పల్లె పల్లెలో ప్రచారం నిర్వహిస్తూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల అవినీతి పాలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే తాండూరులోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానన్నారు. గాజుగ్లాసు గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, నాయకులు నరేష్ మహరాజ్, జనసేన నాయకులు రవి పటేల్, రాము, సాయితేజ, బీజేపీ నాయకులు సుదర్శన్ గౌడ్, రజనీకాంత్, భద్రేశ్వర్, అంతారం లలిత, సాహు శ్రీలత, కిరణ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.